క్లుప్తంగా

అన్నదానానికి విరాళం అందజేత



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం నందిగామ పట్టణానికి చెందిన దొడ్డపనేని మధుసూదనరావు కుటుంబ సభ్యులు రూ.20,116 విరాళంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

అమ్మవారిని దర్శించుకున్న సీనియర్ సివిల్ జడ్జి



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారిని ఆదివారం విజయవాడ సీనియర్ సివిల్ జడ్జి భవాని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు ఆమెను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు, ఏఎస్ఐ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గత నెల 31న సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్ ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి అన్‌రేటెడ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో తమ అకాడమీ విద్యార్థి బట్ప్ అవినాష్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడని రామకృష్ణ చెస్ అకాడమీ కోచ్ అవ్వారు రామకృష్ణ తెలిపారు. అండర్-15 విభాగంలో జరిగిన ఈ పోటీల్లో అవినాష్ 6/6 పాయింట్స్ సాధించి మొదటి స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం అవినాష్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. అవినాష్ ఇలానే మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

శాస్త్రీయ పరిజ్ఞానం పెంపునకు కృషి

జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్



సమావేశంలో మాట్లాడుతున్న గేయానంద్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జన విజ్ఞాన వేదిక ద్వారా సామాన్యులలో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందిస్తున్నామని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. గేయానంద్ తెలిపారు. కొండపల్లిలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎన్టీఆర్, గుంటూరు జిల్లా కమిటీల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జేవీవీ నిర్మాణం, బలోపేతానికి అన్ని జిల్లాల కమిటీ అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు వివిధ రకాల నూతన కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘ చర్చలు జరిపారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావు, జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్, గంగాధర్, కామేశ్వరరావు, జాన్‌బాబు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయానికి చెందిన పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కుప్పా కృష్ణవేణి కళాబృందానికి చెందిన చైత్ర, పూర్వజ, శ్రీహాస, తన్వి, కావ్య, హేమశ్రీలతో పాటు పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. నృత్య ప్రదర్శన అనంతం ఆలయ అధికారులు కళాబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

తినుబండారాలపై పర్యవేక్షణ కరవు

- ఇష్టారాజ్యంగా అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు



ప్యాకెట్‌లో ఉన్న బొమ్మలు



మార్కెట్‌లో విచ్చలవిడిగా అమ్ముతున్న చిన్నారుల తినుబండారాలు

జగ్గయ్యపేట: చిన్నారులకు మార్కెట్‌లలో లభించే తినుబండారాలపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో మార్కెట్‌లోకి వచ్చే తినుబండారాలు కాలం చెల్లినవో లేదో కూడా తెలియకపోవటంతో వాటిని తింటూ పిల్లలు అనారోగ్యంపాలవుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు మౌనంగా ఉండిపోతున్నారు. మరి కొన్ని రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభమవుతుండటంతో మార్కెట్‌లోకి రకరకాల తినుబండారాల విక్రయాలకు వ్యాపారులు సిద్ధమయ్యారు.

లక్షల్లో వ్యాపారం..

జగ్గయ్యపేట ప్రాంతంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వద్ద నిత్యం చిన్నారులకు అవసరమయ్యే చిరుతిండ్ల వ్యాపారం లక్షల్లో జరుగుతుంది. మార్కెట్‌లోకి రకరకాల చిప్స్, చెకోడీలు, వివిధ రకాల పేర్లతో స్వీట్స్ వంటివి వస్తుండటంతో విక్రయదారులు వాటిని చిన్నారులకు ఎడాపెడా అమ్మేస్తున్నారు. కనీసం వాటిని ఎప్పుడు తయారు చేశారో.. ఎప్పుడు కాలం చెల్లుతుందో కూడా తెలియకుండా చేస్తున్నారు. పాఠశాలల్లో విరామ సమయంలో విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలోని చిరుతిండ్ల వ్యాపారానికి ప్రత్యేకంగా ఏజెన్సీలు కూడా ఏర్పాటు చేసుకున్నారు.

తెలంగాణ నుంచి సరఫరా..

ఈ ప్రాంతానికి చిరుతిండి వస్తువులన్నీ తెలంగాణ ప్రాంతం నుంచి సరఫరా అవుతాయి. కనీసం చిరుతిండ్ల ప్యాకెట్లపై ఎక్కడ తయారీ, ఎన్నిరోజులు ఉంటుందనే సమాచారం కూడా ఉండదు. దీంతో చిరువ్యాపారులు ఏజెన్సీల వద్ద కొనుగోలు చేసుకుని విక్రయాలు చేస్తుంటారు. తెలంగాణ నుంచి దాదాపు వందల రకాల చిరుతిండ్ల ప్యాకెట్లు వస్తున్నాయి.

పట్టించుకోని ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు..

పట్టించుకోవాల్సిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. కనీసం పాఠశాల ఉపాధ్యాయులు, యాజమాన్యం కూడా వ్యాపారులకు చెప్పలేని పరిస్థితి. కొన్ని పాఠశాలల వద్ద ఈగలు వాలిన తినుబండారాలను కూడా విక్రయిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పర్యవేక్షణ అవసరం..



పాఠశాలల వద్ద చిన్నారులకు ఇష్టానుసారంగా తినుబండారాలను విక్రయించకూడదు. యాజమాన్యాలు, ఉపాధ్యాయులు నియంత్రించాలి. చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నారులు తినే వస్తువులపై అధికారులు అవగాహన కల్పించాలి. పిల్లల ఆరోగ్యం దృష్ట్యా తినుబండారాలపై పర్యవేక్షణ అవసరం.

–నాగలక్ష్మి, బలుసుపాడు

బమటి పదార్థాలతో అనర్థం..



పాఠశాలల వద్ద చిన్నారులు తినే తినుబండారాలు చాలా హానికరమైనవి. ఒక్కోసారి వాటిని తినటం వలన అనారోగ్యానికి గురవుతారు. మార్కెట్‌లో లభ్యమయ్యే మంచి కంపెనీల తినుబండారాలనే తీసుకోవాలి. అది కూడా మానుఫ్యాక్చరింగ్ తేదీ చూసి తీసుకోవాలి.

–ఎన్.అనిల్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, బూచవరం

అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీనే

ప్రభుత్వ విప్ ఉదయభాను



ప్రభుత్వ విప్ ఉదయభానును కలిసి హర్షం వ్యక్తం చేస్తున్న రవికుమార్, పద్మకుమారి

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది, జగ్గయ్యపేటలో కూడా గెలిచేది తామేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఈనెల ఒకటో తేదీ రాత్రి ఎగ్జిట్ పోల్స్ అన్నీ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని చెప్పటంతో ఆదివారం రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మకుమారితో పాటు పెనుగంచిప్రోలు గ్రామ బూత్ కమిటీలు ఎమ్మెల్యే ఉదయభానును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ఎగ్జిట్ పోల్స్ అన్నీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని చెప్పాయని, పార్టీ శ్రేణులంతా సంయమనం పాటిస్తూ క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. ఎవరైనా రెచ్చగొట్టే మాటలు మాట్లాడినప్పటికీ రెచ్చిపోకుండా కౌంటింగ్‌లో ఫలితాలు వచ్చే వరకు ఓపిక పట్టాలని, ఎక్కడా ఎటువంటి వ్యాఖ్యానాలు చేయకుండా ఉండాలని సూచించారు.

ప్రసూతి, సంతాన సాఫల్య చికిత్సలపై సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ వెల్లంకి సుజాత తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రసూతి, సంతాన సాఫల్య చికిత్సల్లో అందుబాటులోకి వస్తున్న ఆధునిక వైద్య పరిజ్ఞానంపై నగరంలో రెండు రోజుల పాటు సదస్సు నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, గైనకాలజీ సొసైటీ ఆఫ్ విజయవాడ, అను మై బేబీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని హోటల్ ఫార్చ్యూన్ మురళీ పార్క్‌లో ఈ సదస్సు జరిగింది. ఈ సదస్సులో నిపుణులు అత్యంత క్లిష్టతరమైన ప్రసూతి కేసులు, పునరుత్పత్తి ఔషధ విభాగంలో విప్లవాత్మక ఆవిష్కరణలను వివరించారు. నూతన ఆవిష్కరణతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్న తీరును వివరించారు. ఆధునిక ఔషధాల వినియోగం ద్వారా పునరుత్పత్తికి సంబంధించిన అనేక సమస్యలకు పరిష్కారం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అను హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ జి.రమేష్, ఐఎంఏ విజయవాడ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ చలసాని ప్రమోద్, డాక్టర్ అక్కినేని శివరామ్, ప్రసూతి వైద్యుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వెల్లంకి శ్రీదేవి, డాక్టర్ వెల్లంకి సుజాత, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కోడే ప్రభాదేవి, డాక్టర్ జి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అడవి సత్యమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పల్నాడు జిల్లా మాదిపాడు వద్ద అడవి సత్యమ్మతల్లి ఆలయంలో ప్రభుత్వ విప్ ఉదయభాను తదితరులు



పేటలో వెండి మహాలక్ష్మి ఆలయంలో జలబిందెలను సమర్పిస్తున్న రాజ్యలక్ష్మి, మహిళలు

జగ్గయ్యపేట అర్బన్: పల్నాడు జిల్లా, మాదిపాడు అడవుల్లో ఉన్న అడవి సత్యమ్మతల్లికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఉదయభాను ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ముక్త్యాల వద్ద కృష్ణా నది అవతల ఉన్న మాదిపాడుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి వెళ్లిన ఆయన అడవి సత్యమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

ఉదయభాను గెలుపును కాంక్షిస్తూ..

ఈనెల 4వ తేదీన వెలువడనున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో తమ అభిమాన నాయకుడు సామినేని ఉదయభాను మరలా గెలవాలని కోరుకుంటూ జగ్గయ్యపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అడవి సత్యమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముత్యాలమ్మ అమ్మవారికి జలబిందెలతో..

సామినేని ఉదయభాను మరలా భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు మునిని రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మహిళలు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక అద్దాల బజారులో ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో అమ్మవారికి, శ్రీముత్యాలమ్మ అమ్మవారికి జల బిందెలను సమర్పించారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి



పేటలో మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ప్రసాద్‌బాబు



కంచికచర్ల గ్రంథాలయంలో డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక జిల్లా గ్రేడ్-1 స్థాయి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఎ.ప్రభ అన్నారు. 15వ రోజు ఆదివారం ముందుగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం గ్రంథాలయాధికారి ప్రభ పుస్తక సమీక్షపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు టి.ప్రసాద్‌బాబు విద్యార్థులకు నీతి కథలు, నీతి వాక్యాలు, మోటివేషన్ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు వర్షిత, గ్రంథాలయ సిబ్బంది శ్యామల, రమేష్, సత్యావతి పాల్గొన్నారు.

కంచికచర్ల: గ్రంథాలయంలో ఈనెల 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు అల్లూరి రామచంద్రుడు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో విద్యార్థులకు చెస్, మ్యూజికల్ చైర్స్, డ్రాయింగ్, యోగా నేర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వరరావు, కవి నీలం సర్వేశ్వరరావు, ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, యోగా గురువు నవీన్ నాని, ఎం.మల్లిఖార్జునరావు, బీడీసీ నిర్వాహకుడు శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీల కార్యాలయాల వద్ద బందోబస్తు



తిరువూరు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు



తిరువూరు పోలీసుస్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

తిరువూరు: ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఈ సందర్భంగా తిరువూరు నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థుల నివాసాల వద్ద, పార్టీల కార్యాలయాల వద్ద ఆదివారం నుంచి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల ఇళ్ల వద్ద పోలీసు బందోబస్తు కల్పించడంతో పాటు అభ్యర్థులకు వ్యక్తిగత భద్రత ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళి పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలులో ఉన్నందున ముగ్గురికి మించి ఒకేచోట గుమిగూడటం, బహిరంగ ప్రదేశాల్లో చర్చా వేదికలు నిర్వహించడం చట్టవిరుద్ధమని పోలీసులు మైకు ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని లాడ్జీలు, కల్యాణ మండపాలు, ఫంక్షన్‌హాళ్లను తనిఖీ చేసిన పోలీసులు అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్లను ఏర్పాటు చేశామని, సరిహద్దు గ్రామాల్లో చెక్‌పోస్టులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనుమతి లేకుండా సమావేశాలు, సభలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం నేరమని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్..

ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి ఎన్నికల నియమావళి వివరించారు. అనవసర వివాదాల్లో జోక్యం చేసుకున్నా, శాంతిభద్రతలకు విఘాతం కల్పించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపటితో టెన్షన్‌కు ముగింపు



ఓటు వేసేందుకు క్యూలో నిలబడిన ఓటర్లు (ఫైల్)

నియోజకవర్గంలో పోలింగ్ సరళి..

నియోజకవర్గంలో పోలింగ్ శాతం	87.58
నియోజకవర్గంలో మొత్తం ఓట్లు	2,05,480
పోలైన ఓట్లు	1,79,952
మొత్తం పురుషుల ఓట్లు	99,398
పోలైన పురుషుల ఓట్లు	87,769
మొత్తం మహిళల ఓట్లు	1,06,076
పోలైన మహిళల ఓట్లు	92,179
మొత్తం ఇతరుల ఓట్లు	6
పోలైన ఇతరుల ఓట్లు	4
హోమ్ ఓటింగ్	108
పోస్టల్ బ్యాలెట్	2,102

నందిగామ: ఉత్కంఠకు తెరపడే సమయం సమీపిస్తోంది. పెరిగిన పోలింగ్ శాతం ఎవరికి అనుకూలమో తెలియక అటు అభ్యర్థులతోపాటు ఇటు ఆయా పార్టీల నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం నమోదు కావడంతో గెలుపోటములపై అభ్యర్థులు ఒక అంచనాకు రాలేకపోతున్నారు. పథకాల ప్రభావంతో సైలెంట్ ఓటింగ్ పడిందనే భావన అధికశాతం ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

బరిలో ఎందరున్నా.. పోటీ ఇరువురి మధ్యే..!

నియోజకవర్గంలో తొమ్మిది మంది అభ్యర్థులు బరిలో నిలిచినప్పటికీ, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్య మధ్యే పోటీ నడిచింది. దీంతో ఈ రెండు పార్టీల నాయకులే ఎంతో ఉత్కంఠగా ఫలితాల కోసం నిరీక్షిస్తుండగా, మిగిలిన పార్టీల అభ్యర్థులతోపాటు ప్రజలు కూడా ఆసక్తిగా ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు.

కౌంటింగ్ వివరాలు..

ఇబ్రహీంపట్నం సమీపంలోని నోవా ఇంజినీరింగ్ కళాశాలలో నందిగామ నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ జరగనుంది. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రారంభం కానుంది. దీనికోసం పోస్టల్ బ్యాలెట్లు లెక్కించేందుకు 4 టేబుల్స్, అసెంబ్లీ ఓట్లు లెక్కించేందుకు 14 టేబుల్స్, పార్లమెంటు ఓట్లు లెక్కించేందుకు మరో 14 టేబుల్స్ ఏర్పాటు చేసి లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. అసెంబ్లీకి సంబంధించి 16 రౌండ్లు, పార్లమెంటుకు సంబంధించి 16 రౌండ్లలలో ఓట్ల లెక్కింపు జరగనుంది.

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు

ఏసీపీ రవికిరణ్



సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ రవికిరణ్

జగ్గయ్యపేట: ఈ నెల నాలుగున ఓట్ల లెక్కింపు నేపథ్యంలో సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు నందిగామ ఏసీపీ రవికిరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం సర్కిల్ పోలీసులతో భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో అల్లర్లు జరగకుండా పికెటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పట్టణంలోని ప్రధాన సెంటర్‌లలో 24 గంటల పాటు సిబ్బంది విధుల్లో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున కౌంటింగ్ సందర్భంగా విజయోత్సవాలు, గుమిగూడటాలు, ర్యాలీలు, సమావేశాలు నిషే ధించామని చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గ్రామాల్లో కూడా బైండోవర్‌లో ఉన్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఐ పరమేశ్వరరావు, ఎస్ఐలు పద్మారావు, సూర్యభగవాన్, సతీష్, రాంబాబు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వీరులపాడు: ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. నేర చరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అల్లర్లు, ఘర్షణలు ప్రేరేపించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

నందిగామ: రౌడీ షీటర్లు అనవసరంగా వివాదాలకు పోతే చర్యలు కఠినంగా ఉంటాయని ఏసీపీ రవికిరణ్ హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఈనెల నాలుగో తేదీన కౌంటింగ్ నేపథ్యంలో ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా కౌంటింగ్ రోజు గానీ, ఆ తరువాత గాని ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ హనీష్ , పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

వీరులపాడు: ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఏసీపీ రవికిరణ్ పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో పోలీస్ సిబ్బందికి ఆదివారం ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల లెక్కింపు సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో అల్లర్లు, ఘర్షణ వాతావరణం చోటు చేసుకోకుండా పోలీస్ పికెటింగ్‌తో పాటు పెద్ద ఎత్తున సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మహాలక్ష్మణుడు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి శాంపిల్స్ సేకరణ



తాగునీటి పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

పాయకాపురం(విజయవాడరూరల్): తాగునీటిలో ఎలాంటి కాలుష్యం కాలేదని ప్రజలకు భరోసా కల్పిస్తూ అధికారులు ప్రజల సమక్షంలోనే శాంపిల్స్ సేకరిస్తున్నారు. 64వ డివిజన్ ప్రజాశక్తి నగర్, రాధానగర్‌లోని తాగునీటి ట్యాంక్‌ల పరిధిలో ఆదివారం విజయవాడ నగరపాలక సంస్థ తాగునీటి సరఫరా విభాగం డీఈ లక్ష్మీసింధూర, ఏఈ అరుణ్‌కుమార్‌లు శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. రిపోర్టులో కాలుష్యం కాలేదని వచ్చిందన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో వృద్ధుల్లో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, తాగునీటి వల్ల కాదన్నారు. వైద్య సిబ్బందితో ఇంటింటా సర్వే చేసినా ఎలాంటి డయేరియా కేసు నమోదు కాలేదన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటించడంలో ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.